# చెట్లు క్షమించవు

ఎల్లుండి బోటనీ పరీక్ష. ఎంత చదివినా తరగటంలేదు. పైగా, చదివిందీ చదవందీ ఒక్కలాగే వుంది. ప్రపంచం అంతా బోటనీమయం లాగుంది. దారిలో ఓ పువ్వుల మొక్కో చెట్టో చివరికి గడ్డిపోచో కనబడినా పాఠాలు జ్ఞాపకాని కొస్తున్నాయి. ఓమూల ఆకలి దంచేస్తోంది. ఇంకా అరమైలు నడవాలి అయ్యర్‌గారి అన్న సత్రానికి. అయినా, ఎవరిక్కావాలీ వృక్షశాస్త్రం? ఈ చెట్లు ఎలా పుట్టి ఎలా పెరిగి ఎలా చస్తే మనకేం? ఈ శాస్త్రజ్ఞులూరుకుంటూరా? పెల్లగించి, రిసెర్చి చేసి, సిద్ధాంతీకరించి ప్రబంధాలు రాసి మా మొహాన్న పారేస్తారు. పరీక్షల్లో ఇవే మా పాలిట బాంబులు.

కాని, ఆలోచిస్తున్నకొద్దీ ఈ వృక్షజీవితానికీ మానవ జీవితానికీ ఏదో సన్నిహిత సంబంధం కనబడుతుంది. ఈ యిద్దరు ప్రాణులూ ఎన్నో కష్టనష్టాల కోర్చి జీవిస్తారు. ఇక జీవితలక్ష్యం కూడా ఒక్కటే... సంతానం. ఎక్కడ వాళ్ళ వంశం వాళ్ళతోటే అంతరిస్తుందోనన్న వెర్రి మమకారం కొద్దీ మన తల్లిదండ్రులు మనల్ని కని యీ భూమిమీద ఎలా పారేశారో...అలాగే యీ చెట్లూను.

ఇక మన మధ్యతరగతి కుటుంబాల్లో యీ పెళ్ళికొడుకుల గొంతెమ్మ కోరికలు తీర్చడానికి ఆడపిల్లలకి చదువు సంధ్యలనీ, అంద చందాలనీ, కట్నాలు కానుకలనీ....మనం ఎలా బాధపడతామో ఈ చెట్లూ ఈ సీతాకోక చిలుకల్ని ఈ తేనెటీగల్ని మెప్పించటానికి ఆ పువ్వులకు ఆకారమని, రంగని, సువాసనని, మకరందమనీ........ఎన్నో పాట్లు పడతాయి.

కని, పెంచి, పెద్దవాళ్ళనిచేసి, వాళ్ళ బ్రతుకులు వాళ్ళు బ్రతకగలరనేటంతవరకూ పిల్లల్ని గురించి మనిషి పడే బాధే చెట్లూ పడతాయి. పువ్వు పూసి, పువ్వు కాయై, కాయ పండై, ఆ పండులోని తమ సంతానమైన విత్తనాల్లో స్వాతంత్ర జీవనానికి కావల్సిన ఆహారాన్ని పరికరాల్ని అమర్చి, ఈ విశాల

ఆగత్తులో ఎక్కడో అక్కడ సురక్షితంగా జీవించమని దీవించి తన విత్తనాల్ని వెదజల్లుతుంది. చూడండి ......ఆ పుత్ర వాత్సల్యం! నిజంగా యీ చెట్లకే నోరూ కాళ్ళూ చేతులూ వుంటే తమతోడి ప్రాణులయిన మానవులతో తమ కష్టసుఖాలు చెప్పుకుంటూ చెయ్యగలిగినదేమైనా వుంటే చేస్తూ ఎంతో అన్యోన్యంగా వుండే వనుకుంటాను. అసలు జె. సి. బోస్ సిద్ధాంతం తలుచుకుంటే మతే పోతుంది. చెట్లుకూడా ఆనందిస్తాయిట, ఆలోచిస్తాయిట, విచారిస్తాయిట కూడాను. తన కొమ్మ నరికేసినపుడు ఒకచెట్టు ఎంత ఏడ్చిందో కళ్ళకి కనబడేటట్టు ప్రయోగంతో నిరూపించి పారేశాడు. ఘోరం! దుర్మార్గుడు! అలా ఏడుస్తుంటే ఎలా చూడ గలిగాడో?

ఇలా ఆలోచించుకుంటుంటే హోటల్ వచ్చేసింది. లోపలికెళ్ళాను. మామూలే. ఇంకా భోజనం చెయ్యవలసిన వాళ్ళు ఇరవై మంది 'క్యూ'లో వున్నారు. అప్పుడే ఓ లంబోదరుడు తనకంటే ముందర టిక్కట్లు కొన్నారన్న కోపమో ఏమోకాని క్యూలోవున్న ఇరవైమందికేసీ ఒకసారి తన త్రినేత్రంతో భస్మీభూతం చేసే ప్రళయ రుద్రుడిలాగ ఒక్క చూపుచూసి బెంచీమీద నా పక్కనే బైటా యిస్తూ నా మీద మరింత అనురాగంతో యుద్ధం మొదలెట్టాడు. అతని వాలకం చూస్తే పలకరించీలాగ కనబడ్డాడు. అయినా, ఎందుకయినా మంచిదని, అదీకాక మనిషినిచూస్తే చలాగ్గా ఓ యేనుగును కొరుక్కు తినేసీలా కనబడుతున్నాడు - పైగా దుష్టుడికి దగ్గిరగా ఎందుకనీ,మెల్లగా జరిగి మూలకి నక్కి ఓ కాలు బెంచీ మీదమోపి గోడకి జార్లాపడి కళ్ళు మూశాను.

టేబుల్ ముందర చతికిలబడ్డాను. ఎదురుగుండా కూర్చున్నాడో అపర నరసింహావతారం. అప్పుడే ఒక ప్లేటు ఖాళీ చేశాడు. ప్లేటునిండా ఎముకలు మిగిలాయి. ఇంకో ప్లేటు మాంసం తెమ్మన్నాడు. సర్వర్ నన్నడిగాడు. 'మాంసా హారమా' అని. 'శాకాహారం' అన్నాడు. ఎదురుగుండా వున్న మనిషి నా మొహం కేసి చురచుర చూసి సర్వర్‌తో 'వీళ్ళకి ప్రత్యేక స్థలం లేదా?' అన్నాడు. 'లే'దని సర్వర్ లోపలికిపోయి ఒక ప్లేట్లో అన్నం, ఒక ప్లేట్లో ములక్కాడల సాంబార్, మరో ప్లేట్లో చిక్కుడుకాయ కూర తీసుకొచ్చి నా ముందర పెట్టాడు. రెండూ కాస్త ఇష్టమయినవేకదా అని భోజనాని కుపక్రమించే ప్రయత్నంలో ప్లేట్లు ముందరికి లాక్కుంటున్నాను. అంతవరకూ తల పైకెత్తకుండా తింటున్న ఆ విగ్రహం తల పైకెత్తి 'పర్వాలేదులే' అన్నాడు. నా కర్థం కాలేదు. నేను

సాంబార్ అన్నం తింటుంటే అతని కేం? తల పైకెత్తి చూశాను. నా ప్లేటు కనబడకుండా చెయ్యి అడ్డంపెట్టుకు తింటున్నాడు.

ఏదో దొంగతనం చేస్తున్నట్లు ప్లేటు చప్పుడు కాకుండా నెమ్మదిగా దగ్గిరకి లాక్కుని అన్నం కలుపుకుంటున్నాను.

''ఏ వూరు మీది?'' అన్నాడు తనచేతి చాటునుంచి. అసలు సమాధానం చెప్పకూడ దనుకున్నాను ఆ నిరసన భావం చూసి. కాని, అతని ఆకార పరిమాణమో, ఆ బొద్దు మీసాలో మరి ప్లేట్లో ఎముకలో తెలీదు - నాకు తెలికుండానే నా చేత సమాధానం చెప్పించాయి. నెమ్మదిగా ఎవళ్ళో గొంతుక నొక్కేస్తున్నట్లు "చింత పేట" అన్నాను.

"ఏం చేస్తున్నావు?"

"ఇంటర్ పరీక్ష కెడుతున్నాను." సమాధానం తప్పలేదు.

"ఏమిటి గ్రూపు?''

"బోటనీ, జూఆలజీ, కెమిస్ట్రీ.'' కాస్త ధైర్యం మొచ్చింది.

"హుఁ.... బోటనీయా! అర్థంచేసుకునే చదువుతున్నావా?"

"ఏం?" అన్నాను. అసలు ఈ ప్రశ్న మా బోటనీ ప్రొఫెసర్ అడుగుతే కత్తిలాగ "ఓ యస్'' అనేవాణ్ణి. కాని ఈ మనవ పర్వతం ముందర నసగవల్సి వొచ్చింది.

"అహఁ........ అసలు అడుగుతున్నాను. ఊఁ........ మొక్కల్లో ప్రాణం వుంటుందా?''

"ఆ."

"మది....నోరో?"

"లేదు."

''హుఁ.... అయితే అంతా తెలుసుండే చేస్తున్నావన్నమాట? అందుకనే యీ మానవలోకంలో ఈ అన్యాయాలు, దుర్మార్గాలు, ఈ కరువులు, యుద్ధాలు పెచ్చుపెరిగిపోతున్నాయి. వాటి వుసురు తగలకుండా పోతుందా?

''నే చేసే తప్పేమిటో నా కర్థం కావటంలేదు'' అన్నాను, ఈ విపరీత ధోరణి అర్థంకాక.

''ఎందు కర్థమౌతుంది? హుఁ.... తరతరాలుగా నీ రక్తంలో జీర్ణించిన అజ్ఞాన తిమిరంలో నీ పాపపుణ్య విచక్షణాశక్తి కూడా నశించింది. నీతో సమానంగా ఈ భూమి మీద పుట్టి పెరిగిన నీ తోటి ప్రాణులయిన ఈ అమాయకపు నోరులేని చెట్లూ చేమల్ని హింసించి వాట్ల శవాల్ని ముక్కలు ముక్కలుగా చేసి భక్షించి ఆనందించటమే నీ నాగరకత అన్నమాట....అవునా?''

నేను ముద్ద నోట్లో పెట్టుకుందా మనుకుంటుంటే యీ మాటల్తో చెయ్యి దింపేశాను. ఏదో కాస్త ఇష్టమయిన కూరా, పులుసూ వండేదనుకుంటే మధ్యన పీడి బాధేమిటి....పెళ్ళిలో చావు బాజాలాగ? అంతవరకూ మెతుకు కొరికితే మీ తోడు. ఒళ్ళు మండింది.

''అయితే, ఏం తిని బతకమంటారు?'' అన్నాను కాస్త స్వరం హెచ్చించి.

''మనమంతా జంతుజాతికి చెందినవాళ్ళం. మన జాతిలో మనం ఒకళ్ళ నొకళ్ళు చంపుకుతినొచ్చు. అది ధర్మం. చూడు, చిన్న చేపల్ని పెద్ద చేపలు తింటాయి. వాటిని తిమింగలాలు తింటాయి. పురుగుల్ని కోళ్ళు తింటాయి. ఈ కోళ్ళనీ, చేపల్నీ, మేకల్నీ మనం తింటాం. మనల్ని పులులూ, సింహాలూ తింటాయి. ఇది మన జాతి ధర్మం. ఏమంటావ్?'' అన్నాడు.

''ఊఁ........'' అన్నాను ఆలోచన తోచక.

''అలా ఓ జంతువునుంచి ఓ జంతువు తప్పించుకు తిరుగుతుంది. ఆయువు మూడితే పెద్ద జంతువు చేతుల్లో చిక్కుకుంటుంది. ఇదీ మానవాది జంతువులు జీవించే విధానం. మాట్లాడవేం?''

ఇంతలోకే ఒక మెరుపుతీగలాంటి ఆలోచన తట్టింది. తక్షణం ఆగ్నేయాస్త్రంలాగ వదుల్తూ ''ఇతే, యీ చెట్లూ రంగురంగులతో వింత సువాసనలతో ఎంతో రుచిగా యీ పళ్ళూ, కాయలూ ఎందుకు కాస్తున్నాయి?'' అన్నాను. తప్పకుండా యీ దెబ్బతో వెర్రిమొహం వేస్తాడన్న ధైర్యంతో.

''ఓరి అమాయకుడా'' అంటూ మొదలెట్టాడు నా ఆగ్నేయాస్త్రాన్ని ఈగని తోలినట్టు లెక్కచెయ్యకుండా. ఒకసారి ఛీంకారంచేసి, గొంతు సవరించుకొని ''ఇతే విను. మొదటినుంచీ యీ వృక్షజాతి మన జంతుజాతి దౌర్జన్యం నుంచి రక్షించుకోడానికి సామ, దాన, భేద, దండోపాయా లవలంబించింది. అసలు పరిణామ సిద్ధాంతరీత్యా చూస్తే, మొదట్లో జంతుజాతికికూడా నీటీ

నియమం వుండేది. జంతువులు జంతువుల్నే తినేవి. కాని, జంతువులకి రాను రాను పిక్కబలం ఎక్కువవ్వడంతోటే తప్పించుకు పారిపోవడం మొదలెట్టాయి. ఓ మూల తనకంటే పెద్ద జంతువుల్నించి తప్పించుకు తిరగడం, పరోమూల తన ఆకలి తీరడానికి తనకంటే చిన్న జంతువుల్ని తరిమి పట్టుకోవడం, మధ్య మధ్య వాటి ప్రణయ విహారాలు....ఇలాగ నవరసభరితమైన ఒక దివ్య వాతావరణంలో మహదానందంగా జీవించేవి. కొంతకాలానికి కొన్ని నీచ జంతువులకి తుచ్ఛ కామభోగాలమీద ఆసక్తి ఎక్కువయ్యి, ప్రకృతిసిద్ధమైన పౌరుషాభిమానాలు త్యజించి తోకముడిచి, పిరికిపందలయ్యి కొండల్లోనూ, గుహల్లోనూ తలదాచుకుంటూ నోరూ - వాపీ కాళ్ళూ - చేతులూ లేని యీ అమాయిక వృక్షజాతిని కబళించటం మొదలెట్టాయి.......అర్థమౌతోందా?'

''ఆహా ........ కాని, నే నడిగిన ప్రశ్న ........''

''ఆ విషయానికే వస్తున్నాను. ఏనాడు యీ హేయ పరిణామం జంతువుల్లో కలిగిందో, ఆనాటినుంచి వృక్షజాతిలో దుర్బలమైన వరి, జొన్న, గోధుమ' పెసర, కంది మొదలైన మొక్కలు యీ జంతువుల ఆకలికి బలి అయ్యాయి. అది చూసి కంగారువడి కంద, చేమ, అల్లం, ఉల్లిపాయి, వేరుశనగలాంటి మొక్కలు ప్రాణాపాయం రాకుండా వాట్ల ముఖ్యమైన శరీరభాగాల్ని భూమిలో జాగ్రత్తగా పాతిపెట్టి, ఏమి తెలియనట్టుగా నాలుగాకులూ రెమ్మలూ భూమిమీద పెట్టడం మొదలెట్టాయి. ఎంత పరిణామం చెందినా మనిషి తనలో ఆ పంది కొక్కు రక్తం పోగొట్టుకోలేదు. ఊరుకున్నాడా? పెల్లగించి తినడం మొదలెట్టాడు. దీనితోటి హడలిపోయి బీరా, పొట్లా, ఆనపా మొదలైనవి పక్కన కనబడ్డ చెట్టునో పుట్టనో కౌగలించుకుని ఎక్కడో అందకుండా ఆకులవెనక కాయలు కాయడం మొదలెట్టాయి. కాని, వట్టి భ్రమ. తీగలు పెళంగా లాగేసి తినడం మొదలెట్టాడు మానవుడు. ఇది చూసి లాగెయ్యటానికి వీల్లేకుండా గట్టి శరీరాల్ని పెంచి-వెలగ, ములగ, జామ లాంటి చెట్లుకొమ్మల చివర్ల పళ్ళు కాయడం మొదలెట్టాయి. కాని, కోతులూ, కోతుల్లోంచి పరిణామం చెందిన మానవులకి యివో లెఖ్ఖా? ఇదీ లాభంలేదని కొబ్బరి, తాటి, పోకలాంటి చెట్లు ఈ జంతువులు ఎక్కటానికి వీల్లేకుండా కొమ్మలు విసర్జించాయి. అప్పట్లో పెద్ద జంతువులన్నీ వెర్రి మొహా లేశాయి. కాని ఏం లాభం .... ఇన్ని చేసినా పాపం! ఈ ఉడతల బాధ తప్పించుకోలేకపోయాయి. దానితో ఇది పని కాదని

వేప, కుంకుడూ లాంటివి చేదుకాయలూ; చింతా, ఉసిరీ లాంటివి పుల్లటికాయలూ వగరుగా కరక్కాయలూ, నోరు మండించేటట్టు మిరపకాయలూ .... ఇలా కాయడం మొదలెట్టాయి. కాని, మానవుడు తన మేధ వృద్ధి అయినకొద్దీ తన హింసాదృక్పథం కూడా ద్విగుణీకృతం చేస్తూ ఈ కాయ లన్నిటినీ రుచీ, మందూ, మాకూ అనే పేరుతో తన నిత్యజీవితంలో ఉపయోగించుకోవటం మొదలెట్టేడు వింటున్నావా .... తరతరాలుగా మానవాది మృగాలు ఈ వృక్ష జాతిని చేసే చిత్రవధాకల్పం."

"కరతలామలకం చేశారు .... ఇంతకీ తియ్యని పళ్ళూ కాయలూ మాట శలవిచ్చారు కారు!" అన్నాను కళ్ళు తుడుచుకుని ముక్కు ఎగబీలుస్తూ.

''అదే చెబుతున్నాను బాబూ! కొంచెం ఓర్పు నేర్చుకో. ఎప్పుడయితే మానవాది జంతువుల దుష్ట సంకల్పం ముందర తమ ప్రయత్నాలన్నీ వికల్పం అయ్యాయో ఆనాడు మామిడి, నారింజ, ద్రాక్ష, సీతాఫలం మొదలయిన ఫల వృక్షాలన్నీ ఓ తీర్మానం చేశాయి. ఏమిటా తీర్మానం? తమ వంశాభివృద్ధికి మూల కారణమైన ఆ గింజల్ని గట్టిగానో చేదుగానో సృష్టించి వాట్లని తియ్యని మెత్తని పళ్ళలో వుంచి ప్రదర్శించటం. అంటే, మానవుడు ఆ తియ్యని పండు భాగాన్ని అరగించి గింజల్ని పారేస్తాడని, అవి భూమిమీద పడి మొలకలెత్తుతా యని. అంటే-బకాసురుడికి బండెడన్నమిచ్చి మనిషిని మరిపించటం లాంటిది. ఇప్ప డర్థమయిందా.... వెర్రి తండ్రీ! ... కాని....హుఁ....ఇన్ని చేసినా మానవుడికి తృప్తి కలగలేదు. జీడిమామిడి పండు తిని గింజలు కూడా జద్దలకొట్టుకు తింటు న్నాడు. పనస తొనలతోబాటు గింజలూ, బాదంపండుతోబాటు పప్పూ.... మొదలెట్టాడు. అంతటితో ఆగేడా? ఈ పరమాణుయుగం వచ్చేటప్పటికి మానవుడు వైరిద్వేష ఆవేశాల్తో చెట్లు చెట్లు వళంగానే తినెయ్యటం మొదలెట్టాడు. చూడు.... కొత్తిమీరి, మెంతికూర, బచ్చలి మొదలయినవి. ఛీ....ఛీ....ఎంత ఉచ్చస్థితిలో నుంచి ఎంత దీనస్థితికి పరిణామం చెందాడు యీ మానవుడు!.... హుఁ.... అసలు మృగ రాజెవరో తెలుసా?''

''సింహం'' అన్నాను వొణికే గొంతుకతో.

''హుఁ.... నీకంతే తెలుసు. ఆనాడు ధైర్యసాహసాల్లో జంతుజాతీ కంత టికీ మకుటంలా వర్ధిల్లే మానవుడు .... మిగతా పిరికి జంతువులతోబాటు భోగ విలాసాల్లో పడి సీచ శాకాహారానికి ఒడిగట్టాడు. లేకపోతే తన మేధతో విశ్వాన్నంతా

గజగజ వణికించిన మానవుడు మృగరాజ పదవిని సింహానికి వదిలెయ్యవలసి వచ్చునా? అనాటి పిరికిపందల సంత తవ్వడంవల్లనే నేడు మనకి శాకాహారం అబ్బింది. ఏదీ, ఓ బంగినపల్లి మామిడిపండో ఓ వద్లపూడి నారింజపండో సింహానికిచ్చి చూడు తింటుందేమో హుఁ.... అందుకే 'వనజరాజు నిజకరన ఖరవిదారిత హస్త మస్త మస్తిష్క మునే తినునుగాని....' అన్నాడు విష్ణుశర్మ. ఏం అలా వెర్రిమొహం వేశావు-అర్థం కాలేదూ?.... అంటే. సింహం మనుషుల్లాగ ఎక్కడో ఏరిన గింజలో ఎక్కడోకోసిన మాంసం ముక్కో-వండుకుని సెకండ్ హేండ్ తిండి తినేటంత హీనజీవి కాదన్నమాట. స్వహస్తాల్తో సంపాదించిన తిండే తింటుంది. ఏనాడు మానవుడు నిరపరాధులూ నిస్సహాయులూ అయిన ఈ వృక్ష జాతిమీద పడి కబళించటం మొదలెట్టాడో అనాడే అతని ధైర్య సాహసా లడుగంటేయి. అంతవరకూ మనిషికి జడిసిన సింహం యీ కక్కుర్తిచూసి లోకువ కట్టేసి ఒక్కసారి విశ్వం దద్దరిల్లేలాగ గర్జించి మానవుణ్ణి బెదరగొట్టి వనరాజై కూర్చుంది. దీనికి దృష్టాంతం పురాణంలో చూపెట్టమంటావా?.... శాకాహారం తినటం మొదలెట్టిన శ్రీమన్నారాయణుడు పిరికివాడై ఆత్మవిశ్వాసం కోల్పోయి ప్రహ్లాదుణ్ణి రక్షించటానికి హిరణ్యకశిపుణ్ణి స్వహస్తాల్తో చంపవల్సి వచ్చినప్పుడు వచ్చినట్టు సింహంరూపం దాల్చవల్సి వచ్చింది. ఏమంటావ్?''

ఆయన మొహం ఆవేశంతో ఎర్రబడిపోయింది. గొంతుక రుద్రమైపోయింది. కళ్ళు చిచ్చుబుడ్లులాగ జ్ఞానజ్యోతిని వెదజల్లుతున్నాయి కేవలం నా అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేసి విజ్ఞాన జ్యోతిని ప్రసాదించటానికి సాక్షాత్కరించిన ఆ దివ్యమూర్తికి నా మనస్సులోనే సాష్టాంగ నమస్కార సహస్రము లర్పిస్తూ జ్ఞానోదయంతో ఉక్కిరిబిక్కిరై, ఆవేశంతో గొంతు కడ్డంపడి, నోరు పెగలక, కష్టంమీద కళ్ళు మూసుకుని, ఊపిరి బిగవట్టి 'అవును' అనగలిగాను.

క్షణం నిశ్శబ్దం. కొంపదీసి గబుక్కున మాయమయ్యేడేమోనని అనుమానం వేసి కళ్ళు తెరిచాను. లేదు, ఆ విజ్ఞాన విగ్రహం ఇంకా అక్కడే వున్నాడు. తన వేలుతో చూపెడుతూ "అలా చూడు" అన్నాడు. ఏ భయంకర సౌరంగమేనా కనబడుతుందేమోనని భయంతో గుండెదడ చేత్తో అణుచుకుంటూ నెమ్మదిగా పక్కకి తిరిగాను. "చూడు ఆ చిక్కుడుమొక్క...." కిటికీలోంచి ఒక చిక్కుడు తీగ కిటికీ తలుపుకు తగిలి గాలికి టకటక కొట్టుకుంటోంది.

''కనబడిందా.... పాపం! ఏ పాప మెరుగని తన జాతి అమాయిక సంతాన మనుభవిస్తున్న దుర్భర చిత్రవధ చూడలేక గుండెలు బద్దలయ్యేటట్టు తల మొత్తుకుంటూ చేస్తున్న ఆ దీనాక్రందన వినబడుతోందా?" ప్రతీ అక్షరం ఇంజక్షన్ సూదుల్లాగ గుచ్చుకుని నా ప్లేట్లోంచి చిక్కుడు గింజలు ముక్కలు మొలిచి తీగలువేసి నా ఎదురుగా నిలబడి చేతులు జోడించి దీనంగా ప్రార్థిస్తున్నట్లు కనబడింది.

''ఆ ములక్కాడ ముక్కలకేసి, నీ ప్లేట్లో అన్నంకేసి ఓసారి చూడు. అందులో ఒక్కొక్క గింజా తల్లి కడుపున ఎంత అప్యాయంగా పుట్టి ఎంత గారంగా పెరిగిందో, ఈ నాటితో నీ పాపిష్ఠి ఆకలికి బలవ్వకపోతే ఒక్కొక్క గింజా ఒక్కొక్క మొక్కై పచ్చటి పొలాల్లో చల్లగాలికి గర్వంగా తల వూపుతూ ప్రకృతికి జోలపాడేది. ఈనాడు యీ శిశు శవ సహస్రాల్ని నువ్వు ఆనందంగా అరగిస్తుంటే ఆ కన్నతల్లి గర్భశోకం ఎలా వుంటుందో ఆలోచిందావా?'' అయన కళ్ళు చెమ్మగిల్లాయి.

''స్వామీ! అజ్ఞానిని ... అపరాధిని'' అన్నాను మొహం చేతులతో కప్పుకుంటూ.

''మనకి ప్రాణావసరమైన ప్రాణవాయువు మనకిచ్చి బొగ్గు తిని కాలక్షేపం చేస్తూ కొట్టినా తిట్టినా సహించి ఎండ ఘాళుపులో చెంత చేరిన ప్రతి జంతువుకు చల్లదనాన్నిస్తూ పళ్ళూ కాయలూ యిస్తూ జీవించే యీ త్యాగజీవులకు నువ్వు చేసే ప్రత్యుపకారం ఏమిటి? వాటి సమక్షంలోనే వాటి సంతానాన్ని భక్షిస్తూ వాటి శరీరభాగాల్ని తెగనరికి వాటితో దూలాలూ, తలుపులూ, కుర్చీలూ, బల్లలూ, బహూ చేయటం.... పొయ్యిలో పెట్టి బొగ్గు చెయ్యడం.... ఈ బొగ్గును కుంపట్లో పెట్టి మసి చెయ్యడం.... ఇదీ మన ఆనందం! ఔనా?'' అయన కన్నీళ్ళు జలజల రాల్తున్నాయి.

"ఓ వృక్షోద్ధారకా........ మహాపాపిని.... కిరాతకుణ్ణి."

''విచారించి ఏం లాభం? ఆలోచించు నాయనా........ ఈ వృక్ష జాతికే కాళ్ళూ-చేతులూ, నోరూ వుండి మీ తమ్ముణ్ణో చెల్లెల్నో నంచుకు తింటూ వుంటే, మీ తాతయ్య కాళ్ళూ-చేతులూ తెగ్గొట్టి వాటితో వుయ్యాల చేసి తమ ముద్దుబిడ్డలైన తమ విత్తనాల్ని వాటిలో వూపుతూంటే, చిన్నచెట్లు ఆడుకోడానికి నీ బుజా

లెక్కీ నీ జుట్టు పట్టుకు వేళ్ళాడుతూ సరదాకి ఏ వేలో చెయ్యో విరగ్గొడుతూంటే నీ కెలా వుంటుంది?''

''ఓ వృక్షరక్షణ దీక్షాపరాయణా! తమ కర్ణకఠోర వాక్పిరంగుల భీకర ధ్వని దాటి కాగలేను" అన్నాను కుంభవృష్టిని కురుస్తున్న ఆయన అశ్రుధారలు నా జేబురుమాలుతో వత్తుతూ......

''అబ్బాయి!"

''చిత్తం.''

''ఒక్కసారి నీ హృదయచక్షువులు తెరచి చూడు. అదిగో వృక్ష జాతిలో విజృంభిస్తున్న ప్రచండ విప్లవ కల్లోలం. మానవ లోకోద్ధరణకై జన్మించిన వామపక్ష బలగం యీనాడు వృక్ష జాతిలో 'బేక్టిరియా' రూపంలో జన్మించింది. అదిగో 'సన్‌డూ', అదిగో 'బ్లేడర్ వర్ట్,' అల్లదిగో 'పిచర్ ప్లాంట్' - కనబడుతున్నాయా?....జంతువుల్ని తినే మొక్కలు పరిణామం పూర్తవ్వలేదు. చెట్లు కూడా నడుస్తాయి. ఎగురుతాయి. పగసాధిస్తాయి. భవిష్యత్తు భయానకం.... చెట్లు క్షమించవు."

''ఘోరం మహాత్మా!... అదుగో కనబడుతున్నాయి. జంతు శిక్షకి వృక్ష రక్షణకి బద్ధకంకణం ధరించిన వికృతాకృతులతో నవ్య భూజాలు వింత ధ్వజాలతో మానవ పతనాన్ని స్ఫురింపజేసే భయంకర నినాదాలతో 'హరోం హరోం హర.... హరహర హరహర' మంటూ హృదంతరాళం గర్జిస్తూ వస్తున్నాయి. అవుగో, వినబడుతున్నాయి గావుకేకలు ప్రేక్షకా నిరీక్షించి పరీక్షించు. నిర్దాక్షిణ్యంగా ఈ వృక్షాలే నిన్ను కక్షకట్టి చీల్చి చెండాడి శిక్షించి భక్షిస్తాయి." ఆహా! ఏమి యమకావేశం. అదిగో ప్రకృతి నిట్టూర్చింది. మేఘాలు గర్జించేయి. ఆది శేషువు భుజం మార్చేడు. విశ్వం కంపించింది. కాలసర్పం పడగ ఎత్తింది. జగన్నాథ రథం కదిలింది. అవిగో, రథచక్రాల్ రథచక్రాల్ రథచక్రాల్ రథ చక్రాల్ ..."

అయ్యర్ కుదుపుకు మెళువవ వచ్చింది. 'కాళీ అయ్యింది వెళ్ళండి సార్" అన్నాడు. తుడుచుకుంటూ సర్వర్‌తో 'ఏమిటి ఛంటలు?' అన్నాను.

''చిక్కుడుకాయి కూర, ములక్కాడ సాంబార్'' అన్నాడు. టిక్కెట్టు సర్వర్‌కిస్తుంటే చేతులు వణికాయి.

*